# ఆశ..!

- జి.రామలక్ష్మి

భాస్కర్‌కి పడుకోబోయేముందు ఓ గ్లాసుడు పాలు తాగి మరీ పడుకోవడం అలవాటు.

సుజాత పాలు పట్టుకొచ్చి ఇచ్చింది భర్తకి. అవి అతను తాగడం పూర్తి చేయగానే మెల్లగా గ్లాసు అందుకుని టీపాయ్ మీద ఉంచి పక్కకు వచ్చి చేరింది.

"నేను చెప్పింది ఏం చేసారు?'' అంటూ గోముగా అడిగింది.

"రేపు చేయబోతున్నాను. అన్ని ఏర్పాట్లు చేసుకుని మరీ వచ్చాను'' అన్నాడు ఆమెని దగ్గరగా లాక్కుంటూ.

"నేను నమ్మను. అంత తొందరగా మీరు నా మాట వింటారా?'' అంటూ వెనక్కి జరిగింది.

"నిజమేనోయ్! సమస్యలు కుటుంబంలో రాకూడదు. అవి వస్తే డిలే చేయకుండా పరిష్కారం చేసుకోవాలి. సమస్యలు పుట్టగానే వాటికి తగిన పరిష్కారాలు ఉంటాయి. ఆలస్యంచేస్తే మన శ్శాంతి కరువవుతాయి'' భాస్కర్ అంటుంటే సుజాత సంబరపడిపోయింది.

"అయితే నిజంగానే ఈసారి నా మాట పట్టించుకుని విన్నారన్నమాట. థాంక్యూ వెరీమచ్! పెళ్లి చేసుకుంటే సరిపోదు. భార్యల్ని సుఖపెట్టడం కూడా నేర్చుకోవాలి. ఈ మాట అన్నది ఏ మగాడయినా మీనుంచి చూసే నేర్చుకోవాలి సుమా!'' అంటూ మళ్ళీ తనే అతని దగ్గరగా చేరింది.

ఈసారి అతను దూరంగా జరిగి పడుకుంటూ-

"మరోసారి ఆలోచించుకో. నీ నిర్ణయంలో ఏదయినా మార్పు వస్తుందేమో! ఎందుకంటే ఇకమీదట ఇంటి భారం మోయాల్సిందీ, కష్టపడాల్సిందీ నువ్వే మరి'' అంటూ హెచ్చరించాడు.

"ఏం ఫర్వాలేదు. ఆ కష్టమూ ఓ కష్టమేనా?'' అంది సుజాత.

"బరువు బాధ్యతలు మోయడం అనుకున్నంత సులభమేం కాదు. అందులో నువ్వు అతి సుకుమారివి కదా! కోరి కష్టాలు తెచ్చుకుంటున్నావేమో ఒకసారి బాగా ఆలోచించుకో. చేతులు కాల్చుకుని ఆకులు పట్టుకున్నా, వెన్న రాసుకున్నా లాభం ఉండదు.''

"మీరు నన్నేం భయపెట్టక్కర్లేదు. ఈ విషయంలో నా నిర్ణయం మారదు. అంతే!'' అంది సుజాత అతని పక్కనే చేరి మీద చేతులు వేసుకుని పడుకుంటూ.

"రేపటి నుంచి నీ ఈ స్థానం తప్పిపోతుంది. నీకు అవకాశం ఉండదు. నా రెండువైపులా నీకు చోటు మిగలదు'' అంటూ భయపెట్టాడు.

"ఫర్వాలేదు. అది నాకు సంతోషమే'' అంది మొండిగా.

నిట్టూర్చి లైటార్పి పడుకున్నాడు భాస్కర్.

★★★

"అమ్మా సుజాతా! ఇల్లూ, పిల్లలూ, భాస్కర్ జాగ్రత్త! ఎక్కువగా పనులు చేయకు. అలసిపోతావు. వేళకు ఇంత తింటూండు. బలవంతం చేసి తినిపించడానికి నేనూ ఉండడం లేదాయె. అన్ని పనులకు పనిమనిషిని పెట్టుకో. ఒక్కదానివీ చేసుకుంటూ అర్థం పడకు. ఆరోగ్యం జాగ్రత్త'' అంటూ హెచ్చరికలూ, జాగ్రత్తలూ చెప్పి మరీ సుజాత అత్తగారు వర్ధనమ్మ ఓల్డేజ్ హోమ్‌కి కొడుకు వెంట కంట తడి పెట్టుకుంటూ కదిలింది. మనవడు రవి, మనవరాలు ప్రియ ఇద్దరూ బామ్మగారి కాళ్ళకు అడ్డం పడుతూ మరీ ఏడ్చారు "వద్దు బామ్మా వెళ్లకు. మమ్మల్ని వదిలి వెళ్లకు'' అంటూ.

అయినా భాస్కర్, వర్ధనమ్మ వారికి నచ్చచెప్పి మరీ కదిలారు. సుజాత వారిని పట్టుకుంది- వెంబడిస్తూ వెళ్లిపోకుండా అడ్డుకుంది.

★★★

సుజాతకి అత్తగారు వర్ధనమ్మ ఏమీ అడ్డుగా లేదు. ఇంటి చాకిరీ, వంటా, పిల్లల పనులూ అన్నీ వర్ధనమ్మే చేసుకుపోయేది. సుజాతకి గట్టిగా కష్టపడి పనులు చేయడం రావు. కొంచెం ... అలసిపోతుంటుంది.

అందుకే అన్నీ తానే అయి చేసుకుపోతుం... వర్ధనమ్మ. సుజాతకి ఎక్కువగా ఏ పనులూ ... మాయించదు కూడా. పైగా అన్నం పళ్లెం ... చూసుకుని మరీ అందిస్తుంటుంది కోడలికి.

అయితే అన్నీ బావున్నాయి కానీ అంద... తానూ అత్తగారు లేకుండా మొగుడితో ... కాపురం చేసుకోవాలని సుజాతకి ఏనాటినుంచో ఆశా, కోరిక. తన ఫ్రెండ్స్ అందరూ అలాగే ఒకరికి ఒకరుగానే ఉంటున్నారే కానీ మధ్యన ఏ అత్తలూ, మామలూ, ఆడపడుచులూ లేనేలేరు. తనొక్క దాని దగ్గరే అత్తగారు వుంటోంది.

"అమ్మా అది కావాలి, అమ్మా ఇది కావాలి, అమ్మా ఓ సలహా చెప్పు, అమ్మా ఈ సహాయం చేయవా, అమ్మా మేము సినిమాకు వెళ్లమా ... గుడికి వెళ్తున్నాము నీవూ వస్తావా?'' ఇలాంటివి మరెవరికీ లేవు. తనొక్కదానికే వుంటున్నాయి.

భర్త అవి తననే అడగాలి, చేయాలి, తన మీదే పూర్తిగా ఆధారపడాలి.

ఇవీ ఆమె సరదాలు, కోరికలు.

అందువల్ల- మొత్తానికి భర్తని సాధించి మరీ అత్త గారిని ఓల్డేజ్ హోమ్‌కి సాగనంపింది సుజాత.

తాను అనుకున్నది సాధించినందుకు ఆనందంగా తన ఫ్రెండ్స్ అందరికీ ఫోన్‌లు చేసి మరీ చెప్పుకుని సంబరపడిపోయింది సుజాత.

★★★

"ఎలా వుందోయ్ జ్వరం?'' అడిగాడు భాస్కర్.

"వారం దాటినా నాకీ జ్వరం, వొళ్ళు నొప్పులు తగ్గడం లేదేమిటండీ!''

"టైర్డ్‌నెస్‌వల్ల వచ్చిన జ్వరంట ఇది. అందువల్ల కాస్త కోలుకోవడానికి టైము పడుతుందిట డాక్టర్ గారు చెప్పారు'' భాస్కర్ అంటుంటే-


"అమ్మో ఇంకా టైమ్ పడుతుందా? ఇప్పటికే ఈ జ్వరంవల్ల ఇల్లూ, పిల్లలు, మీ పరిస్థితి అస్తవ్యస్తంగా తయారయ్యాయి.

బామ్మ పక్కనే చెరోపక్కన పడుకునే పిల్లలు ఆ లోటు తీర్చుకోవడం కోసం మీకు చెరోపక్కా చేరుతూ మీనుంచి నన్ను దూరం చేసారు. ఏమయినా అంటే 'అమ్మో మేము వంటరిగా పడుకోలేము' అంటున్నారు. నిజమే మీరన్నది- మీరు దూరమయ్యారు. పనా ఎక్కువ అయింది. అలాంటివల్లే నాకీ రోగం పట్టుకుంది'' అంది ఏడుస్తూ.

"స్వతంత్ర రాజ్యం కావాలనుకున్నావు. ఏకఛత్రాధిపత్యం ఏలాలనుకున్నావు. భారం, బాధ్యత, ఆనందం అన్నావు. అనుభవించు మరి'' అన్నాడు భాస్కర్.

"పిల్లలకు పెద్దవాళ్ళ ఆసరా ఎంత అవసరమో తెలుసుకున్నానండీ. వాళ్ళ చేయూత, సలహా,

సహకారాలు, అండ ఎంత ముఖ్యమో గ్రహించానండీ. మా ఫ్రెండ్స్ మాటలు విని పెద్దమనిషి అండని దూరం చేసుకుని మంచాన పడ్డాను. నా తప్పు నేను తెలుసుకున్నాను. పెద్దల అండదండలు లేని కాపురాలు ఎలా వెలగబడతాయో, పెద్దల సహకారంతో సాగే సంసారాలు ఎలా కుదురుగా ఉంటాయో బాగా తెలుసుకున్నాను'' అంటూ కళ్ళు తుడుచుకుంటూ "అత్తగారు లేని ఈ నెలరోజుల్లో ఆవిడ విలువ తెలుసుకున్నాను. ఆవిడ నాకు ఆసరాగా కావాలి. పనిభారం, పిల్లల భారం, వంట భారం ఆవిడ ఒక్కత్తే ఇన్నాళ్ళూ నెత్తిమీద



వేసుకుంటూ చేసుకుపోతుంటే నాకు విలువ తెలియలేదు. కానీ అవి నేను మోయడం చేసాక వాటి విలువా, ఆవిడ విలువా, సంసారం కష్టం అన్నీ తెలిసాయి. పదండి. నేనూ, పిల్లలూ, మీరు వెళ్ళి వెంటనే ఆవిడకి క్షమాపణలు చెప్పుకుని మరీ తీసుకువద్దాం'' అంటూ అంత జ్వరంలోనూ లేస్తుంటే-

"లేవకమ్మా లేవకు. నేను వచ్చేసాను'' అంటూ వర్ధనమ్మ సుజాత ఎదుటకు వచ్చింది.

"నేను- వద్దురా దాన్ని కష్టపెట్టకు, బాధపెట్టకు, అది చిన్నపిల్ల అంటున్నా వినకుండా వీడే నీకు నా విలువ తెలియాలి, బుద్ధి రావాలి అంటూ నాటకం ఆడి నన్ను వాడి ఫ్రెండ్ ఇంట్లో ఉంచి ఈ రోజు తీసుకువచ్చాడు నీ విషయం చెప్పి'' అంది వర్ధనమ్మ.

సుజాత అత్తగారిని కౌగలించుకుని "నన్ను క్షమించండి అత్తయ్యా'' అంటూ భోరుమంది.

మనిషికి ధనబలం ఎంత ముఖ్యమో, ఒకరికి ఒకరుగా ఏ మనిషికయినా ఆసరా, అండా అన్నది అంతే ముఖ్యం.

ఎంత ధనమున్నా ఏ వ్యక్తీ ఈ ప్రపంచంలో మరొకరి ఆసరా లేనిదే వంటరిగా బ్రతకలేరు. పిల్లలకి పెద్దల ఆసరా కావాలి. అలాగే పెద్దలకీ పిల్లల అండదండలు ఉండాలి. వంటరిగా వచ్చాము, వంటరిగా పోతాము అన్నది అబద్ధం. తల్లిదండ్రుల ఆసరాతో పుడతారు. నలుగురు మోస్తేనే కానీ పోలేరు. అదే విధంగా బ్రతుకంతా జరగడానికి ఎందరో, ఎందరెందరో ఆసరాలను ఉపయోగించుకుంటాం. ఇది జీవిత సత్యం!

★